# తెలుపు నలుపులు

ఇంటి గుమ్మాన్ని చూస్తే ఇల్లాల్ని చూడనక్కర్లేదనడంలో ఎంత సబబుందో తెలియదు కాని, పేరుని బట్టి, మనిషి ఆకారాన్ని చూసి, గుణగణాల్ని అంచనా వెయ్యడం లాంటి బుద్ధి పొరబాటు మరొహటుండబోదు.

రామచంద్రం సరిగ్గా ఇటువంటి కోవకే చెందినవాడు.

తండ్రి పోగానే, రాసిన విల్లుని మాయ చేసి దొంగ విల్లుని సృష్టించాడు.

తమ్ముళ్ళూ, తల్లీ నెత్తి నోరూ బాదుకున్నారు.

"ఎందుకలా గొంతు చించుకోడం? ఇది మీకెంత వింతగా వుందో, బాధగా వుందో నాకూ అలానే ఉంది. నా తమ్ముళ్ళ నెత్తిన శఠగోపం పెట్టి, వాళ్ళకీ, నీకూ, కడుపుకోత కలిగించే దుర్మార్గుణ్ణి కాను!" అంటూ విల్లుని చింపి పారేయించి, నలుగురి ఎదుటా పిత్రార్జితాన్ని సమానంగా వాటా వేయించాడు. ఆ దెబ్బతో ఇంటా బయటా రామచంద్రం రామచంద్రమూర్తే అయిపోయాడు. అసలు తండ్రి రాసిన విల్లులో తనకి ఎగనామం పెట్టబడిన సంగతి ఎవరికి తెలుసు కనక! రామచంద్రం తండ్రి అలాంటి విల్లు రాయడం వెనక ఓ చిదంబర రహస్యం ఉంది. రామచంద్రం తండ్రి, సానివాడ సరసుల్లో ముఖ్యుడు. తండ్రి గుణాలు అబ్బిన రామచంద్రం సానివాడ గాలి సోకటంతో అటువైపు అడుగులు వేశాడు. చాలా కాలం వరకూ ఇద్దరూ ఒకే గూటి చిలకతో కులుకుతున్న సంగతి ఇద్దరికీ తెలియ లేదు. ముసురుపట్టిన ఓ రోజు అసుర సంధ్యవేళ ఒకే గుమ్మంలో ఒకరికొకరు ఎదురుపడ్డంతో, ఆ యింటి గువ్వకి వీళ్ళిద్దర్నుంచీ రాబడీ, రామచంద్రానికి తండ్రి విల్లులో స్థానమూ పోయాయి!

పొలం పన్లకొచ్చే మాలపడుచు మాణిక్యాన్ని మాయ మాటలు చెప్పి మనసు దోచుకొన్నాడు రామచంద్రం. వయసులో ఉన్న పిల్ల మనసొక్కటే యిచ్చి కూర్చోకుండా, మరో అడుగు ముందుకు వెయ్యడంతో కాలు జారడం, కడుపు నిండడం జరిగాయి. మాణిక్యం తండ్రి వ్యవహారాన్ని రచ్చకీడ్చకుండా, నేరేడు చెట్టు మాటున రామచంద్రాన్ని నిలదీసి బెదిరించాడు. రామచంద్రం మాణిక్యం మెళ్ళో తాళి కట్టించే బాధ్యత తీసుకొన్నాడు కాని, తాళి కట్టడానికి మట్టుకు ఒప్పుకోలేదు. అయిదొందలు పుచ్చుకొని, పది రూపాయల నాటు మందుల్తో కూతుర్ని మంచిదారిలో పెట్టి, మిగిలిందాంతో తప్ప తాగేశాడు మాణిక్యం తండ్రి. శివాలయం జంక్షన్లో కార్తీక పౌర్ణమినాడు జరిగే బాణాసంచా పందేల్లో జట్కా బండి స్టాండ్ వాళ్ళనీ, సైకిల్ రిక్షా స్టాండ్ వాళ్ళనీ, ఒకళ్ళకి తెలియకుండా మరొకళ్ళని రామచంద్రం ఉసిగొల్పడంతో, వాళ్ళు తారాజువ్వల్నీ, వెలక్కాయల్నీ వెలిగించడం మాని కర్రలతో కలియబడ్డారు. ఉప్పు పొట్లాం తిప్పడంలో ఉద్దండుడైన నాగరాజు కర్ర సాము చెయ్యడంతో, అవతలి వాళ్లకి దెబ్బలు బాగానే తగిలాయి. పోలీసులొచ్చి అందర్నీ కటకటాల వెనక్కు తోసి పారేశారు. మర్నాటి సాయంత్రానికల్లా అందరూ బయటకొచ్చేసినా,

నాగరాజు మట్టుకు రాలేపోయాడు. ధైర్యం చెదిరి, నాగరాజు ఆశ వదులుకొని కూర్చున్నప్పుడు, రామచంద్రం రంగంలో ప్రవేశించి, నాలుగో రోజుకల్లా నాగరాజుని విడుదల చేయించి, రెండు పార్టీలకీ సంధి చేసి, కేసుని కొట్టించేశాడు. మాణిక్యం మెళ్ళో తాళి కట్టి నాగరాజు రామచంద్రం ఋణం తీర్చుకొన్నాడు.

కొండకాపు నాగరాజుకీ, మాలపడుచు మాణిక్యానికీ దగ్గరుండి పెళ్ళి చేయించిన రామచంద్రం రామచంద్రమూర్తే అయ్యాడు.

వరదల్లో కొట్టుకొచ్చే చెట్లపాట రామచంద్రం ఎప్పుడూ చెయ్యిజారి పోనివ్వలేదు. బలగాన్ని చడీచప్పుడు లేకుండా అడవుల్లోకి పంపించి, నీళ్ళు చొచ్చుకొచ్చిన మేరకు మంచి గంధం చెట్లని కూకటి వేళ్ళతో సహా పెళ్ళగించి నదిలో తోసి పారేయించి, పది మైళ్ళు దిగువగా నలుగురెదుగురి గుండా పాట హక్కుదారుడిగా చెట్లని ఒడ్డుకీడ్పించేవాడు. వంట చెరుకుకి పనికొచ్చే చెట్లని పనివాళ్ళకి దానం చేసి, అసలు సరుకుని అమ్మి పాటకు వంద రెట్లు లాభాలు చేసుకొని, విస్తారంగా మూలధనం పెంచేసుకొన్నాడు.

దొంగ రవాణా, విదేశీ వస్తువుల వ్యాపారాన్నీ, నల్లమందు వ్యాపారాన్నీ హస్తగతం చేసుకొని, రెండు మూడు జిల్లాల్లో వీటి సర్క్యులేషన్ పెంచేసి విపరీతంగా నల్ల ధనాన్ని కూడబెట్టాడు.

పేరుకి లోన్ తీసుకొని, పొలంలో చాలా లోతైన రెండు బోరింగుల్ని దింపించాడు. చుట్టుపక్కల పొలాల వాళ్ళ దగ్గర్నుంచి పండిన పంటలో, ఇరవై శాతం ధాన్యం రెట్టింపు ధర యిచ్చికొని, తన కళ్ళంలో పోయించుకొని, మంచి పంట దిగుబడి చూపించేవాడు. ధాన్య సేకరణకొచ్చే ప్రభుత్వాంగం, రూల్సు ప్రకారం సేకరించవలసినంత ధాన్యం కొని, గవర్నమెంట్ రేటు ప్రకారం డబ్బిచ్చి పోయేది. మిగిలిన ధాన్యాన్ని మార్కెట్ రేట్లకమ్మి, ఇటు ప్రజలకీ, అటు ప్రభుత్వానికీ మంచివాడై పోయాడు. కొంత నల్లధనం తెల్లగా మారిపోయేదిలా.

తల మాసిన బంధువుల్లో ఒకరికి రెండు లక్షలు లాటరీలో వస్తే ఆ టిక్కెట్టుని మూడు లక్షలిచ్చి కొనుక్కొని తను వెళ్ళి లాటరీ డబ్బుని అందుకొన్నాడు. కట్టవలసిన పన్నులు కట్టి పారేసి మిగిలిన డబ్బు ధైర్యంగా బ్యాంక్‌లో వేసుకొన్నాడు.

ఎనభై వేలు ఖర్చు చూపించి కట్టించిన బంగాళాలో లక్షా ఎనభై వేలకు పైగా డబ్బు గుమ్మరించాడు. మార్కుల వేటలో, ఉద్యోగాల వేటలో, లైసెన్సులు సంపాదించడంలో అసమర్థుల కండగా నిలిచి, ప్రజల్లో చాలా మంచివాడై పోయాడు.

కొడుకులూ, కూతుళ్ళూ అందరూ జీవితాల్లో సుఖంగా స్థిరపడ్డ తర్వాత, అనాథ శరణాలయానికి, హైస్కూలుకి ధారాళంగా విరాళాలిచ్చి, లోకానికి తెలుపుగా చూపించిన నల్లటి జీవితం నుంచి నిష్క్రమించి విశ్రాంతి తీసుకొన్నాడు.

రామచంద్రాన్ని అంటిపెట్టుకొన్న ఒకే ఒక్క దుర్గుణం ఏమిటంటే, చచ్చేవరకూ నెరిసిన తలకీ, మీసాలకీ రంగు వేసుకోవడం! ఈ ఒక్క తెలుపునీ లోకానికి నలుపుగా చూపించాడు!

('జ్యోతి' మాసపత్రిక : జనవరి 1979)